పరీక్షల సమయంలో ఆందోళన వద్దు

ముషీరాబాద్ మండల ఉప విద్యాధికారి చిరంజీవి


సదస్సులో మాట్లాడుతున్న ఉప విద్యాధికారి చిరంజీవి

సుందరయ్య విజ్ఞాన కేంద్రం: వచ్చే నెల(మార్చి)18వ తేదీ నుంచి జరగనున్న పదో తరగతి వార్షిక పరీక్షల్లో విద్యార్థులు ఎలాంటి ఆందోళన చెందవద్దని ముషీరాబాద్ మండల ఉప విద్యాధికారి చిరంజీవి సూచించారు. పరీక్షలకు పకడ్బందీగా ఏర్పాట్లు చేయడంతో పాటు వాటిని విజయవంతం చేసే బాధ్యత చీఫ్ సూపరింటెండెంట్స్(సీఎస్) డిపార్ట్‌మెంట్ ఆఫీసర్లు(డీఓ)లదే అని ఆయన స్పష్టం చేశారు. డీఈఓ రోషిణి ఆదేశాల మేరకు సోమవారం బాగ్‌లింగంపల్లిలోని అంబేడ్కర్ కళాశాలలో సీఎస్, డీఓలకు శిక్షణ, అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా చిరంజీవి మాట్లాడుతూ.. విద్యార్థులు, ఉపాధ్యాయుల సౌలభ్యం కోసం ఈ ఏడాది నుంచి పదో తరగతి విద్యార్థులకు ఏడు పేపర్లు చేశారని, అందులో భాగంగా జియాలజీ పేపర్ అదనంగా రాయాల్సి ఉంటుందన్నారు. అంతేకాకుండా ప్రత్యేక అవసరాలు కలిగిన విద్యార్థులకు అదనపు సమయం కేటాయించాలని సూచించారు. పరీక్షల సమయంలో ఇన్విజిలేటర్లు, అధికారులు పొరపాట్లు చేస్తే తగిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. సీఎస్, డీఓలు జవాబుపత్రాలను నిర్దేశిత నమూనాలతో రికార్డు చేసి ప్యాకింగ్ చేసి మూల్యాంకన కేంద్రాలకు చేరవేయాలని తెలిపారు. కార్యక్రమంలో మారేడుపల్లి డిప్యూటీ ఎడ్యుకేషన్ ఆఫీసర్ బాలునాయక్, అసిస్టెంట్ కమిషనర్ జూపల్లి నర్సింగ్‌రావు, అంబేడ్కర్ విద్యాసంస్థల డైరెక్టర్ డాక్టర్ రిషికాంత్, అడ్మినిస్ట్రేషన్ ఆఫీసర్ కిరణ్‌కుమార్, హైస్కూల్ ప్రధానోపాధ్యాయుడు విఠలాచారి పాల్గొన్నారు.

ఆదర్శ వివాహాలను ప్రోత్సహించాలి


ఆదర్శ వివాహంలో పాల్గొన్న స్కైల్యాబ్ బాబు

సుందరయ్య విజ్ఞాన కేంద్రం: ఆదర్శ వివాహాలను సామాజిక బాధ్యతతో ప్రోత్సహించాలని కేవీపీఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి టి.స్కైల్యాబ్‌బాబు అన్నారు. కుల నిర్మూలనకు కులాంతర వివాహాలు మార్గదర్శకమని చెప్పారు. సోమవారం సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో కేవీపీఎస్, అభ్యుదయ ఆర్ట్స్ అకాడమీ ఆధ్వర్యంలో కవిత, వెంకటేశ్ ఆదర్శ వివాహం జరిగింది. ఈ సందర్భంగా స్కైల్యాబ్‌బాబు మాట్లాడుతూ.. కులాంతర వివాహాలకు ప్రత్యేక రక్షణ చట్టం తీసుకురావాల్సిన అవసరం ఉందన్నారు. కార్యక్రమంలో ఎస్‌వీకే ట్రస్ట్ కార్యదర్శి ఎస్.వినయ్‌కుమార్, అభ్యుదయ ఆర్ట్స్ అకాడమీ అధ్యక్షుడు డాక్టర్ సిద్ధోజీరావు, ప్రముఖ అంబేడ్కరిస్ట్ కేకే రాజా, బొజ్జ భిక్షమయ్య, పీఎస్ఎన్ మూర్తి, కె.సుజాతవతి, ఎ.జగ్గరాజు, భూపతి వెంకటేశ్వర్లు, టి.సాగర్, ఆనగంటి వెంకటేశ్, జావేద్ పాల్గొన్నారు.

అమర్ షహీద్ భగత్‌సింగ్ పుస్తకావిష్కరణ


పుస్తకావిష్కరణలో పాల్గొన్న అతిథులు

చిక్కడపల్లి: అశోక్‌నగర్ సాంస్కృతిక సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో సోమవారం రాత్రి అశోకనగర్ సాంస్కృతిక కేంద్ర అధ్యక్ష, కార్యదర్శులు బి.రామ్మూర్తి, కార్యదర్శులు బి.సూర్యప్రకాశ్ ఆధ్వర్యంలో సాహితీ–సంగీత సమ్మేళనం జరిగింది. కార్యక్రమంలో భాగంగా ప్రముఖ రచయిత జయసూర్య రచించిన అమర్ షహీద్ భగత్‌సింగ్ పుస్తకావిష్కరణ చేశారు. కార్యక్రమంలో కళారత్న బిక్కి, ప్రముఖ సాహితీవేత్త లక్ష్మణరేఖ గోపాలకృష్ణ, ప్రముఖ హిప్నాటిస్ట్ డాక్టర్ హిప్నో పద్మా కమలాకర్ తదితరులు పాల్గొన్నారు. అనంతరం సరదా క్విజ్, సంగీత విభావరి, చిత్రకళా ప్రదర్శన కొనసాగాయి. ఈ సందర్భంగా సీనియర్ ఉత్తమ జర్నలిస్టులు చిలుకూరి అఖిలేశ్, ముడుంబాయి శ్రీనివాస్, గణేశ్, తంగెళ్లపల్లి కనకచారి, భీష్మచారి, పరుశురామ్ తదితరులను సన్మానించారు.

అన్నదానం కూడా సామాజిక సేవే


పండ్లు పంపిణీ చేస్తున్న సురేందర్‌రెడ్డి

సుందరయ్య విజ్ఞాన కేంద్రం: పేదల ఆకలి తీర్చడం కూడా సామాజిక సేవలో భాగమేనని హైకోర్టు అడ్వకేట్ ఎస్.సురేందర్‌రెడ్డి అన్నారు. సోమవారం చిక్కడపల్లిలో కందూరి కృష్ణ ఫౌండేషన్, సేట్ మాణిక్‌లాల్ ఫౌండేషన్ సంయుక్త ఆధ్వర్యంలో సుమారు 600 మంది విద్యార్థులు, పేదలకు అల్పాహారం, పండ్లు అందించారు. ఈ సందర్భంగా సురేందర్‌రెడ్డి మాట్లాడుతూ.. సామాజిక సేవా కార్యక్రమాలు నిరంతరం నిర్వహించడం స్ఫూర్తిదాయమని చెప్పారు. కార్యక్రమంలో ఫౌండేషన్ చైర్మన్ కందూరి కృష్ణ, అడ్వకేట్ కె.కౌశిక్, పారిశ్రామికవేత్త ప్రమోద్ అగర్వాల్, అడ్వకేట్ హెచ్.గోవింద్ రావు తదితరులు పాల్గొన్నారు.

జాతీయ స్థాయిలో ఉద్యమించాలి


సదస్సులో మాట్లాడుతున్న చాడ వెంకట్‌రెడ్డి

హిమాయత్‌నగర్: కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం హిందుత్వ ఎజెండాతో పనిచేస్తోందని, సంఘ్ పరివార్ ఆలోచనను, ఆకాంక్షలను అమలు చేస్తోందని, అందుకోసం 'బీజెపి హఠావో, దేశ్ బచావో' అనే నినాదంతో ముందుకెళ్లాలని సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యుల చాడ వెంకట్ రెడ్డి పిలుపునిచ్చారు. అఖిల భారత దళిత హక్కుల ఉద్యమం (ఏఐడిఆర్ఎం) జాతీయ సమితి సమావేశాల నేపథ్యంలో తెలంగాణ రాష్ట్ర దళిత హక్కుల పోరాట సమితి ఆధ్వర్యంలో సోమవారం బషీర్‌బాగ్ దేశోద్ధారక భవన్‌లో 'మనువాదం–దళితులు–రాజ్యాంగం'' అనే అంశంపై సదస్సు జరిగింది. ఈ సదస్సుకు దళిత హక్కుల పోరాట సమితి రాష్ట్ర అధ్యక్షుడు బందెల నర్సయ్య సభాధ్యక్షత వహించారు. చాడ వెంకట్ రెడ్డి మాట్లాడుతూ జనాభా ప్రతిపాదికన రిజర్వేషన్లు, సౌకర్యాలు, నిధుల కేటాయింపులపై జాతీయ స్థాయిలో ఉద్యమించాలని సూచించారు. 'గరీబీ హఠావో, అచ్చాదిన్ అయేగా' అనే నినాదాలు ఎన్ని వచ్చినప్పటికీ వాటి అమలు ప్రధాన ప్రశ్నగా మారిందన్నారు. పాలకులు మారుతున్నప్పటికీ పేదరికం పోలేదని,పాలకులు నిస్సిగ్గుగా వ్యవహరిస్తున్నారన్నారు. ఏఐడిఆర్ఎం అధ్యక్షుడు ఎ.రామ్మూర్తి, ప్రధాన కార్యదర్శి బి.ఎస్.నిర్మల్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

'క్రైస్తవు'ల రాష్ట్ర సదస్సుకు సీఎంకు ఆహ్వానం

హిమాయత్‌నగర్: తెలంగాణ క్రిస్టియన్ జేఏసీ ఉద్యమకారుల రాష్ట్ర సదస్సు త్వరలో రవీంద్ర భారతిలో నిర్వహిస్తున్నట్టు జేఏసీ రాష్ట్ర చైర్మన్ జిలకర రవికుమార్ తెలిపారు. ఈ సదస్సుకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డితో పాటు పలువురు మంత్రులను ఆహ్వానించనున్నట్లు ఆయన అన్నారు. ఈమేరకు సోమవారం జేఏసీ ప్రతినిధులు ముఖ్యమంత్రి సలహాదారులు వేం.నరేందర్ రెడ్డిని కలిసి సదస్సు వాల్ పోస్టర్‌ను అందజేశారు. రాష్ట్ర జేఏసీ కో చైర్మన్ మేకల సారయ్య, జిల్లా చైర్మన్లు దాసరి శ్యామ్ రావు,చెరుకూరి రత్నరాజ్,కుర్రి ఏలియా, బంగారి రమేష్ తదితరులు పాల్గొన్నారు.


నరేందర్ రెడ్డిని కలిసిన జేఏసీ నేతలు

మేరు కులస్తుల సమస్యలు పరిష్కరించండి


పొన్నం ప్రభాకర్‌ను సత్కరిస్తున్న పోల్కం శ్రీనివాస్

అబిడ్స్: మేరు కులస్తుల దీర్ఘకాల సమస్యలను పరిష్కరించాలని రాష్ట్ర కాంగ్రెస్ ఓబీసీ సెల్, మేరు యువజన సంఘం తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల చైర్మన్ పోల్కం శ్రీనివాస్ పేర్కొన్నారు. నగర ఇన్‌చార్జ్ మంత్రి పొన్నం ప్రభాకర్‌ను ఆయన సన్మానించి మెమొరాండం అందజేశారు. ఈ సందర్భంగా పోల్కం శ్రీనివాస్ మాట్లాడుతూ..మేరు కులస్తులకు తహసీల్దార్లు జారీ చేసే కుల ధ్రువపత్రాలలో మేరు పదం ఉండడం లేదన్నారు. మేరు కులస్తులైన తమకు కుల ధ్రువీకరణ పత్రాల్లో మేరు కులం వచ్చే విధంగా చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు. మేరు కులస్తులను బీసీ–డీ గ్రూప్ నుంచి బీసీ–ఏ గ్రూప్‌లోకి మార్చాలని పేర్కొన్నారు. కుట్టు మెషీన్లతో జీవనం గడిపే మేరు కులస్తులకు రాష్ట్ర వ్యాప్తంగా ఉచితంగా కుట్టు మెషీన్లు ఇవ్వాలని ఆయన అన్నారు.


వేడుకల్లో పాల్గొన్న బీజేపీ జిల్లా అధ్యక్షుడు గౌతంరావు, యశ్వంత్


నివాళి అర్పిస్తున్న సీనియర్ కాంగ్రెస్ నేత దిడ్డి రాంబాబు

మరాఠా యోధుడికి నివాళి

కాచిగూడ: మరాఠా యోధుడు ఛత్రపతి శివాజీ జయంతి కార్యక్రమాలు సోమవారం ఘనంగా జరిగాయి. సోమవారం బర్కత్‌పురలోని బీజేపీ నగర కార్యాలయంలో ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ ఎస్.గౌతంరావు, యువమోర్చ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎ.యశ్వంత్ శివాజీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. శివాజీ ధైర్యసాహసాలు యువతకు ఆదర్శమన్నారు. కార్యక్రమంలో కేసరి నర్సింగ్ యాదవ్, సి.సందీప్‌యాదవ్, రవీందర్‌గౌడ్, నాగరాజ్‌చారి, ప్రశాంత్ దూబే, శ్రీధర్‌గౌడ్, అరుణ్, లక్ష్మణ్, సునిల్, అర్జున్, ఎస్.రాజేశ్, మల్లికార్జున్, శ్రీకాంత్, జగన్ యాదవ్, మింటు పాల్గొన్నారు.

శివాజీనగర్ బస్తీలో..

నారాయణగూడ శివాజీనగర్ బస్తీలో జరిగిన కార్యక్రమంలో కాచిగూడ బీజేపీ కార్పొరేటర్ కన్నె ఉమా రమేశ్‌యాదవ్, కాంగ్రెస్ సీనియర్ నేత, జీహెచ్ఎంసీ మాజీ ఫ్లోర్ లీడర్ దిడ్డి రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

తెలంగాణ బీసీ జాగృతి ఆధ్వర్యంలో..

నల్లకుంట: తెలంగాణ బీసీ జాగృతి ఆధ్వర్యంలో నల్లకుంట రత్నానగర్‌లో గల జాగృతి కార్యాలయంలో శివాజీ చిత్రపటానికి పూలమాలలు వేసిన నివాళి అర్పించారు. కార్యక్రమంలో బీసీ జాగృతి అధ్యక్షుడు మురళీ కృష్ణ, రత్నానగర్ బస్తీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు పి.ఈశ్వర్, ప్రధాన కార్యదర్శి ఎంబీ కిశోర్ కుమార్, సంయుక్త కార్యదర్శి వీరయ్య, జాగృతి కార్యదర్శి పాతకోటి మహేశ్, ప్రతినిధులు దూసరి వెంకట్ గౌడ్, సురేందర్ పాల్గొన్నారు.

అంబర్‌పేట నియోజకవర్గంలో..

అంబర్‌పేట: గోల్నాకలో జరిగిన వేడుకలకు ఎమ్మెల్యే కాలేరు వెంకటేశ్, బాగ్ అంబర్‌పేట కార్పొరేటర్ పద్మా వెంకట్‌రెడ్డి, సీనియర్ నాయకుడు బి.వెంకట్‌రెడ్డి పాల్గొన్నారు. గోల్నాకలో జరిగిన కార్యక్రమాలకు బీజేపీ సెంట్రల్ జిల్లా అధ్యక్షుడు గౌతంరావు, నాయకులు రవీందర్ గౌడ్, ఈశ్వర్ పాల్గొన్నారు.

రాంనగర్‌లో..

ముషీరాబాద్: రాంనగర్‌లోని జైదుర్గా భవానీ యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఉచిత రక్తదాన శిబిరం నిర్వహించారు. కార్యక్రమంలో నగేశ్ ముదిరాజ్ తదితరులు పాల్గొన్నారు.


నివాళి అర్పిస్తున్న ఎమ్మెల్యే వెంకటేశ్, బీఆర్ఎస్ నేతలు


నివాళి అర్పిస్తున్న బీసీ జాగృతి నేతలు, రత్నానగర్ బస్తీ సంక్షేమ సంఘం ప్రతినిధులు



రక్తదాన శిబిరంలో పాల్గొన్న నగేశ్ ముదిరాజ్

బీసీ కమిషన్ చైర్మన్‌కు సన్మానం


కృష్ణమోహన్ కలిసిన నాయకులు

కవాడిగూడ: బీసీ కుల గణనకు అసెంబ్లీలో ఆమోదం లభించినందుకు బీసీ–ఏ కులాల హక్కుల పరిరక్షణ కమిటీ రాష్ట్ర వ్యవస్థాపక అధ్యక్షుడు డాక్టర్ ప్రొఫెసర్ భాగయ్య హర్షం వ్యక్తం చేశారు. ఈమేరకు కమిటీ సభ్యులు రాష్ట్ర బీసీ కమిషన్ చైర్మన్ వకులాభరణం కృష్ణమోహన్‌రావును సోమవారం సన్మానించారు. కార్యక్రమంలో పరిరక్షణ కమిటీ అధ్యక్షుడు ఎమ్మెస్ నరహరి, ఉపాధ్యక్షుడు గడప శ్రీహరి, గొడవబోయిన శివరత్నం ఆర్కే భగవాన్, అంబటి మల్లయ్య, సుధాకర్ గంగపుత్ర పాల్గొన్నారు.

పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత


కార్యక్రమంలో జాయింట్ కమిషనర్ రంగనాథ్

కాచిగూడ: పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యతని సిట్, క్రైమ్స్ జాయింట్ కమిషనర్ ఏవీ రంగనాథ్ అన్నారు. ఎన్విరాన్ ప్రొటెక్షన్ డెవలప్‌మెంట్ కౌన్సిల్ వ్యవస్థాపకుడు రంగయ్య ఆధ్వర్యంలో రూపొందించిన 'ఎన్విరాన్‌మెంట్ యాక్టివిస్ట్'ను సోమవారం సిట్ కార్యాలయంలో ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా రంగనాథ్ మాట్లాడుతూ.. పర్యావరణ సమతుల్యత లోపించడంతో ప్రస్తుతం అనేక అనర్థాలు ఎదుర్కొంటున్నామని చెపఆపరు. పర్యావరణాన్ని కాపాకోవడం మానవ ధర్మమని అభిప్రాయపడ్డారు. ఆ దిశగా అడుగులు వేస్తున్న ఎన్విరాన్‌మెంట్ ప్రొటెక్షన్ డెవలప్‌మెంట్‌కు శుభాకాంక్షలు తెలిపారు.

నామినేటెడ్ పదవుల్లో అవకాశం ఇవ్వండి

ఉస్మానియా యూనివర్సిటీ: పార్టీ కోసం పదేళ్లుగా పని చేస్తున్న నాయకులకు నామినేటెడ్ పదవుల్లో అవకాశం కల్పించాలని ఓయూ విద్యార్థి నేత నిరుద్యోగ జేఏసీ చైర్మన్ భీమ్‌రావునాయక్ పేర్కొన్నారు. సోమవారం నెహ్రూనాయక్, సుధీర్ రెడ్డి నివాసాలకు వెళ్లి పుష్పగుచ్ఛాలు అందజేసి అభినందనలు తెలిపారు. పార్టీ గె లుపు కోసం పని చేసిన వారిని సీఎం రేవ ంత్‌రెడ్డి గుర్తిస్తారని, అసెంబ్లీ ఎన్నికల మా దిరి పార్లమెంట్ ఎన్నికల్లో సైతం కాంగ్రెస్ గెలుపు కోసం కృషి చేయాలని నెహ్రూనాయక్, సుధీర్ రెడ్డి సూచించారన్నారు.

పెండింగ్ పనుల పూర్తికి వినతి

అడ్డగుట్ట: డివిజన్‌లో పెండింగ్‌లో ఉన్న పనులన్నీ త్వరితగతిన పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలని బీజేపీ నాయకులు సోమవారం డిప్యూటీ కమిషనర్ సుభాష్ రావును కలిసి వినతిపత్రం అందజేశారు. వారు మాట్లాడుతూ.. అడ్డగుట్ట చౌరస్తా నుంచి నందనార్ నగర్ గణేష్ టెంపుల్ వరకు వరద నీటి పైప్‌లైన్ పనులు త్వరగా పూర్తి చేయాలని అదే విధంగా డివిజన్‌లోని పలు ప్రాంతాల్లో రోడ్లన్నీ ధ్వంసమై అధ్వానంగా మారాయని, వాటికి వెంటనే మరమ్మతులు చేయాలన్నారు. వినతి ఇచ్చిన వారిలో హంసరాజు, వేణుగోపాల్, నరేందర్, శివలింగం, ఉదయ్ పాల్గొన్నారు.

ముగిసిన పుస్తక ప్రదర్శన

దాదాపు 5 లక్షల మంది హాజరైనట్లు అంచనా


పుస్తక ప్రదర్శలో పాల్గొన్న సందర్శకులు

కవాడిగూడ: నగరంలోని కళాభారతి (ఎన్టీఆర్) స్టేడియంలో ఈ నెల 9న ప్రారంభమైన 36వ హైదరాబాద్ నేషనల్ బుక్ ఫెయిర్ సోమవారం ఘనంగా ముగిసింది. హైదరాబాద్ బుక్‌ఫెయిర్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన జాతీయ పుస్తక ప్రదర్శనకు నిత్యం వేలాది మంది తరలివచ్చి.. నచ్చిన పుస్తకాలను కొలుగోలు చేశారు. పది రోజుల పాటు కొనసాగిన ఈ ప్రదర్శనకు సుమారు 5 లక్షల పైచిలుకు సందర్శకులు హాజరైనట్టు అంచనా. పుస్తక ప్రదర్శనకు ప్రజాయుద్ధనౌక గద్దర్ ప్రాంగణంగా నామకరణం చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన గద్దర్ భారీ కటౌట్ సందర్శకులను విశేషంగా ఆకట్టుకుంది. బుక్ ఫెయిర్‌లో ప్రముఖ సాహితీవేత్త రవ్వా శ్రీహరి వేదికపై కవులు, రచయితలు రచించిన వివిధ పుస్తకాలు ఆవిష్కృతమయ్యాయి.

చిన్నారి నృత్య కళాకారులకు సన్మానం



సర్టిఫికెట్లు అందుకున్న కళాకారులతో సతీశ్

చిక్కడపల్లి: క్షమాగుణం, ఏకాగ్రత అలవర్చుకుంటే భవిష్యత్తులో ఉన్నత శిఖరాలకు చేరుకోవచ్చని నంది అవార్డు గ్రహీత, 10 టీవీ న్యూస్ అసోసియేట్ ఎడిటర్ సతీశ్ పేర్కొన్నారు. సోమవారం ఓం నమో నటరాజ కూచిపూడి అకాడమీ ఆధ్వర్యంలో త్యాగరాయ గానసభలో నిర్వహించిన నృత్య ప్రదర్శనకు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పిల్లలకు సంప్రదాయ కళలను నేర్పించాల్సిన అవసరం ఉందన్నారు. కార్యక్రమంలో చిన్నారి కళాకారులు ప్రదర్శించిన కూచిపూడి నృత్యం ప్రేక్షకులను ఆకట్టుకుంది. అనంతరం కళాకారులను అభినందించి సన్మానించారు. కార్యక్రమంలో నిర్వహణ సంస్థ అధ్యక్షుడు కె.శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శి సునిత తదితరులు పాల్గొన్నారు.

బీజేఆర్ నగర్‌లో కార్పొరేటర్ పర్యటన

పద్మారావునగర్: బన్సీలాల్‌పేట్ డివిజన్ బీజేఆర్ నగర్‌లో సోమ వారం కార్పొరేటర్ హేమలత పర్యటించి బీజేఆర్ నగర్‌లో సుమారు రూ.61 లక్షల వ్యయంతో ఏర్పాటు చేస్తున్న నూతన డ్రైనేజీ పైపులైన్ పనులను పరిశీలించారు. భవిష్యత్‌లో డ్రైనేజీ సమస్య లేకుండా తగిన విధంగా నిర్మాణాలు చేపట్టాలని జలమండలి అధికారులకు సూచించారు. బీజేఆర్ నగర్‌లో డ్రైనేజీ శాశ్వత పరిష్కారానికి గట్టి చర్యలు తీసుకుంటున్నామన్నారు. లక్షలాది రూపాయల వ్యయంతో డ్రైనేజీ పనులను చేపడుతున్నామని బీజేఆర్‌నగర్ బస్తీ అభివృద్ధికి నిర్మాణాత్మకమైన కార్యక్రమాలతో ముందుకు సాగుతున్నట్లు ఆమె పేర్కొన్నారు. కమ్యూనిటీహాల్ నిర్మాణం, తాగునీరు, డ్రైనేజీతో పాటు అనేక సమస్యలను పరిష్కరించడం జరిగిందన్నారు. లక్ష్మీపతి, బల్‌రామ్, రాజు, నర్సింగ్‌రావు, పరశురామ్ పాల్గొన్నారు.

ప్రేక్షకులపై థియేటర్ సిబ్బంది దాడి



గాయాలపాలైన నీరజ్, నవీన్

ముషీరాబాద్: సినిమా చూసేందుకు వెళ్లిన ప్రేక్షకులపై థియేటర్ సిబ్బంది దాడి చేసిన సంఘటన ఆర్టీసీ క్రాస్ రోడ్స్‌లోని దేవి 35 ఎంఎం థియేటర్‌లో జరిగింది. బాధితులు, వారి కుటుంబ సభ్యులు తెలిపిన వివరాలు.. రీరిలీజ్ అయిన వర్షం సినిమా చూసేందుకు శనివారం రాత్రి రాంనగర్‌లోని దీన్‌దయాల్‌నగర్‌కు చెందిన నీరజ్, నవీన్ వెళ్లారు. సినిమా చివరి దశలో ఉండగా నలుగురు థియేటర్‌లోకి వచ్చి వీరిని టికెట్లు చూపించమన్నారు. వారు మొబైల్‌లో టికెట్లను చూపించగా.. ఆన్‌లైన్ టికెట్లు అవసరం లేదంటూ ఫోన్ విసిరేశారు. ఈక్రమంలో మధ్య వాగ్వాదం జరగగా.. కొంతమంది సిబ్బంది వచ్చి ఇద్దరినీ బాత్‌రూమ్‌లోకి తీసుకెళ్లి బంధించారు. ఈలోపు నీరజ్ తన సోదరుడు ధీరజ్‌కు ఫోన్ చేసి విషయం చెప్పడంతో అతని స్నేహితుడు బాలకృష్ణతో కలిసి థియేటర్‌కు రాగా వారిని కూడా బంధించారు. మొత్తం 13 మంది సిబ్బంది ఈ నలుగురిపై కూల్‌డ్రింక్ బాటిళ్లు, ట్రేలతో దాడి చేశారు. దీంతో నీరజ్ తలకు, మిగతా వారికి ఇతర శరీర భాగాలపై గాయాలయ్యాయి. విషయం తెలుసుకున్న పోలీసులు బాధితులను గాంధీ ఆస్పత్రికి తరలించి చికిత్స చేయించారు. అయితే, నిందితుల్లో ముగ్గురికి మాత్రమే మద్యం టెస్ట్ నిర్వహించగా పాజిటివ్ వచ్చిందని బాధితులు తెలిపారు. పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసినా కేసు నమోదు చేయకపోగా తమనే బెదిరించారని, ముగ్గురు నిందితులను సైతం విడిచిపెట్టారని బాధితులు చెబుతున్నారు. కాగా, కేసు విత్‌డ్రా చేసుకోవాలని థియేటర్ యాజమాన్యం కోరిందని తెలిపారు. నిందితులపై కేసు నమోదు చేసి న్యాయం చేయాలని బాధితులు కోరుతున్నారు.

'సైబర్ సెక్యూరిటీ' శిక్షణకు దరఖాస్తుల స్వీకరణ

కాచిగూడ: నేషనల్ అకాడమీ ఆఫ్ సైబర్ సెక్యూరిటీ ఆధ్వర్యంలో ఉద్యోగ, ఉపాధి కోర్సుల్లో శిక్షణ కోసం ఆన్‌లైన్‌లో దరఖాస్తులను స్వీకరిస్తున్నట్టు ఆ సంస్థ డైరెక్టర్ విమలా రెడ్డి సోమవారం తెలిపారు. సైబర్ సెక్యూరిటీ ఆఫీసర్, డిప్లొమా ఇన్ సైబర్ సెక్యూరిటీ అండ్ ఎథికల్ హాకింగ్, పీజీ డిప్లొమా ఇన్ సైబర్ సెక్యూరిటీ అండ్ ఎథికల్ హాకింగ్ కోర్సుల్లో శిక్షణ ఉంటుందన్నారు. ఇంటర్, డిగ్రీ, పీజీ, ఇంజినీరింగ్, పాలిటెక్నిక్ అభ్యర్థులు అర్హులు. కోర్సులో చేరేందుకు ఫిబ్రవరి 29వ తేదీలోగా దరఖాస్తు చేసుకోవాలి. మరిన్ని వివరాలకు సెల్: 78931 41797లో సంప్రదించవచ్చు.

ఆత్మరక్షణకు కరాటే చక్కని సాధనం


విద్యార్థులకు గ్రేడింగ్ బెల్ట్‌లు అందజేస్తున్న రమేశ్‌యాదవ్, విశ్వనాథ్

కాచిగూడ: ఆత్మరక్షణ కోసమే కాదూ.. ఆరోగ్యానికి కరాటే చక్కని సాధనమని బీజేపీ హైదరాబాద్ సెంట్రల్ జిల్లా ఉపాధ్యక్షుడు కన్నె రమేశ్‌యాదవ్ అన్నారు. యమగూచి, తైక్వాండో అకాడమీ సీనియర్ మాస్టర్ విశ్వనాథం ఆధ్వర్యంలో సోమవారం కాచిగూడ లింగంపల్లిలో కరాటేలో శిక్షణ పొందుతున్న విద్యార్థులకు బెల్ట్ గ్రేడింగ్ పరీక్షలు నిర్వహించారు. అనంతరం అర్హత సాధించిన విద్యార్థులకు ధ్రువీకరణపత్రాలతో పాటు కలర్ గ్రేడింగ్ బెల్టులు ప్రదానం చేశారు. కార్యక్రమంలో డీఎస్ నర్సింగరావు, పులిగంటి వేణుగోపాల్, వైజీటీఏ తైక్వాండో అకాడమీ ప్రతినిధులు పాల్గొన్నారు.

'ఇక ప్రజాసేవలో..' సినిమాకు ఉచిత ప్రవేశం

ముషీరాబాద్: బహుజన సమాజ్ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ ఆర్.ఎస్.ప్రవీణ్‌కుమార్ జీవిత చరిత్ర ఆధారంగా రూపొందించిన 'ఇక ప్రజాసేవలో..' సినిమాను నేడు(మంగళవారం) ఉచితంగా ప్రదర్శిస్తున్నట్టు ఆ పార్టీ సికింద్రాబాద్ జిల్లా అధ్యక్షుడు రుద్రవరం సునీల్ సోమవారం తెలిపారు. దుర్గదేవ్‌నాయుడు దర్శకత్వంలో తెరకెక్కిన ఈ సినిమాను మంగళవారం సుదర్శన్ 35 ఎంఎం థియేటర్‌లో ప్రదర్శిస్తామని, ఈ అవకాశాన్ని ప్రజలంతా సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

ఆరోగ్యంపై అశ్రద్ధ వద్దు


వైద్య సిబ్బందిని అభినందిస్తున్న తనికెళ్ల భరణి

కాచిగూడ: ఉచిత వైద్య శిబిరాన్ని ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని ప్రముఖ సినీ నటుడు తనికెళ్ల భరణి అన్నారు. రజక సంఘం సహకారంతో మెడికోవర్ హాస్పిటల్(బేగంపేట బ్రాంచ్) ఆధ్వర్యంలో ప్రగతినగర్‌లో ఏర్పాటు చేసిన వైద్య శిబిరాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా తణికెళ్ల భరణి మాట్లాడుతూ.. కాలానికి అనుగుణంగా ప్రతిఒక్కరూ ఆరోగ్యంపై శ్రద్ధ వహించాలన్నారు. శిబిరంలో భాగంగా బీపీ, సుగర్, ఈసీజీ, ఐ చెకప్, డెంటల్ తదితర వైద్య పరీక్షలు నిర్వహించారు. కార్యక్రమంలో హాస్పిటల్ బ్రాంచ్ హెడ్ రాజ్‌కుమార్, మేనేజర్ వినోద్ కుమార్, సునిల్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

బాధితులను ఆదుకోవాలి


కార్పొరేటర్‌కు వినతిపత్రం ఇస్తున్న బాధితుడు

చిక్కడపల్లి: హుస్సేన్‌సాగర్ నాలా ప్రహరీ నిర్మాణంలో ఇళ్లు కోల్పోయిన బాధితులకు డబుల్‌బెడ్ రూం ఇళ్లు మంజూరు చేయాలని కార్పొరేటర్ ఎ.పావని వినయ్‌కుమార్ ప్రభుత్వాన్ని కోరారు. నాలా ప్రహరీ నిర్మాణంలో భాగంగా సబర్మతినగర్‌లో ఇల్లు కోల్పోయిన రాజు సోమవారం కార్పొరేటర్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. సమస్యని కలెక్టర్ దృష్టికి తీసుకెళ్తానని చెప్పారు. కార్యక్రమంలో నేతలు ఎ.వినయ్‌కుమార్, రత్న సాయిచంద్, శ్రీకాంత్, సత్తిరెడ్డి, ప్రకాశ్ యాదవ్, నర్సింహ ఉన్నారు.

రైలు ఢీకొని మహిళ మృతి



కాచిగూడ: రైలు ఢీకొని గుర్తుతెలియని మహిళ మృతి చెందిన ఘటన కాచిగూడ రైల్వే పోలీస్ స్టేషన్ పరిధిలో సోమవారం జరిగింది. రైల్వే ఇన్‌స్పెక్టర్ ఆర్.ఎల్లప్ప తెలిపిన వివరాలు.. బుద్వేల్–ఉందానగర్ రైల్వేస్టేషన్ల మధ్య రైలు ఢీకొని గుర్తుతెలియని మహిళ మృతి చెందింది. సమాచారం అందుకున్న పోలీసులు మృతదేహాన్ని ఉస్మానియా ఆస్పత్రికి తరలించారు. రైల్వే హెడ్ కానిస్టేబుల్ వీఎల్ చారీ కేసు నమోదు చేశారు. మృతురాలి వివరాలు తెలిసిన వారు ఫోన్: 8712658584లో సంప్రదించవచ్చు.

రేవంత్‌రెడ్డి చిత్రపటానికి పాలాభిషేకం

హిమాయత్‌నగర్: జీహెచ్ఎంసీ ప్రధాన కార్యాలయం ఆవరణలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి చిత్రపటానికి కాంగ్రెస్ ఎమ్మెల్సీ బల్మూరి వెంకట్‌తో పాటు కార్పొరేటర్లు పాలాభిషేకం నిర్వహించారు. జీహెచ్ఎంసీ అభివృద్ధికి సీఎం రూ.1100 కోట్ల నిధులు మంజూరు చేసినందుకు సోమవారం జీహెచ్ఎంసీ స్టాండింగ్ కౌన్సిల్ సమావేశం సధర్బంగా సీఎంకు కృతజ్ఞతలు తెలియజేసి, కౌన్సిల్ సమావేశాలకు హాజరయ్యారు. కార్పొరేటర్లు పి.విజయరెడ్డి, రజిత,రాజశేఖర్ రెడ్డి,జగదీశ్వర్ గౌడ్, బాబా ఫసియుద్దీన్,సిఎన్ రెడ్డి,బొంతు శ్రీదేవి తదితరులు పాల్గొన్నారు.

రోడ్ల మరమ్మతులు చేయాలి

లిబర్టీ: తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ రోడ్లు భవనాల శాఖ అదనపు కార్యదర్శి కె.హరీష్‌ను దళిత బహుజన విద్యార్థి సమైక్య తెలంగాణ రాష్ట్ర శాఖ అధ్యక్షులు వలిగొండ శ్రీనివాస్ కలిశారు. రోడ్లు భవనాల శాఖ అదనపు కార్యదర్శిగా పదవీ బాధ్యతలు చేపట్టిన నేపథ్యంలో సోమవారం ఆయనను కలిసి అభినందించారు. ప్రధానంగా గ్రామీణ ప్రాంతాల్లో రోడ్లు అస్తవ్యస్తంగా ఉన్నాయని పూర్తిస్థాయిలో మరమ్మత్తులు చేయడంతో పాటు గ్రామీణ ప్రాంతాల్లో మారుమూల ప్రాంతాల్లో నూతనంగా రోడ్డు వేసి ప్రజల ఇబ్బందులు తీర్చాలని విజ్ఞప్తి చేశారు.